ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 23 మే 2025 www.prajaswaramdaily.com 3

# అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపిస్తున్న బేగంపేట రైల్వేస్టేషన్

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభం**

**గట్కేసర్ నుంచి యాద్రాద్రి వరకు ఎంఎంటీఎస్ మంజూరు**

**కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మినిస్టర్**



బేగంపేట : చిన్నప్పటి నుంచి చూస్తున్న బేగంపేట స్టేషన్ ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపించేలా మారిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. 'అమృత్ భారత్' పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునికీకరించిన 103 రైల్వే స్టేషన్లను భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు ఉన్నాయి. బేగంపేట రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అలాగే, భవిష్యత్‌లో మరిన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రంతో కలిసికట్టుగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. గట్కేసర్ నుండి యాదాద్రి వరకు భక్తుల కోసం ఎంఎంటీఎస్ సర్వీస్‌ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ రైల్వే మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. ఘట్ కేసర్ – యాదాద్రి మార్గాన్ని ఆరు నెలల్లో పూర్తిచేయాలన్న దిశగా ప్రయత్నిస్తున్నామని, దీనిపై సీఎం తో చర్చించి త్వరిత క్లియరెన్స్‌కి సహకరిస్తానని తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మళ్ళీ ఎన్‌కౌంటర్

**ఐదుగురు మావోయిస్టులు హతం**

**ఛత్తీస్‌గఢ్ లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు**

**పీడియా అటవీ ప్రాంతంలో ఇంకా కొనసాగుతున్న కాల్పులు**



రాయగఢ్: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. తాజాగా బీజాపూర్ జిల్లాలోని పీడియా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇరువర్గాల మధ్య ఇంకా కాల్పులు జరుగుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కాగా, నిన్న నారాయణ్‌పూర్ జిల్లా అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు హతమైన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు కూడా మృతి చెందాడు. అలాగే, బాపట్ల జిల్లాకు చెందినట్లుగా భావిస్తున్న మరో కీలక నేత సజ్జ నాగేశ్వరరావు కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అయితే, మృతదేహాలను గుర్తించి, పోస్టుమార్టం నిర్వహించిన తర్వాతే ఈ విషయంపై అధికారిక స్పష్టత రానుంది.

**కొనసాగుతున్న కూంబింగ్, మృతదేహాల గుర్తింపు**

అబూజ్‌మాడ్ ఘటన స్థలంలో భద్రతా బలగాలు ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. గాయపడి తప్పించుకున్న మావోయిస్టుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడం, భారీ వర్షం కురుస్తుండటంతో మృతదేహాలను తరలించే ప్రక్రియ ఆలస్యమవుతోందని పోలీసు వర్గాలు తెలిపాయి. కొన్ని మృత దేహాలను మాత్రమే నారాయణ్‌పూర్ ఆసుపత్రికి తరలించారు. మృతుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత, వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

**వ్యూహాత్మక దాడి, కేంద్రం ప్రశంసలు**

కర్రె గుట్టలో సుమారు 24 రోజుల క్రితం జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మరణించినప్పటికీ, అగ్రనేతలు తప్పించుకున్నారు. దీంతో, అబూజ్‌మాడ్‌ను సురక్షిత ప్రాంతంగా భావించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు నంబాల కేశవరావు నేతృత్వంలో కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో స్థాయి నేతలు సమావేశమైనట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందింది. ఈ పక్కా సమాచారంతోనే భద్రతా బలగాలు మూడు రోజులుగా వ్యూహాత్మకంగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి దాడి చేశాయి. మావోయిస్టులకు మూడు నుంచి నాలుగు అంచెల భద్రత ఉన్నప్పటికీ, బలగాలు వారిని ఛేదించి భారీ విజయం సాధించాయని తెలుస్తోంది. ఈ ఆపరేషన్ విజయం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి, హోంమంత్రి భద్రతా బలగాలను అభినందించారు. అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# బుల్లెట్ దిగిందా? లేదా?

**కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ**

**ప్రతిపక్షాలకు కేంద్రమంత్రి బండి సంజయ్ విసుర్లు**

**కరీంనగర్ నుంచి తిరుపతికి రైలు**

**నేను, పొన్నం లేఖలు రాశాం**

**రద్దీ సాంకేతిక కారణాలతో సాధ్యపడలేదని వెల్లడి**



హైదరాబాద్ : గతంలో బీఆర్ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దూరం చేసుకున్నారు. కానీ ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్నాక – ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేస్తున్నారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలి," అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు.

అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ.1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేంద్రం ఈపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే, రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడలేదని, ప్రస్తుతం వారానికి రెండు సార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కరీంనగర్ స్టేషన్ లో రూ.27 కోట్ల వ్యయంతో జరిగిన ఆధునీకరణ పనుల తరువాత కరీంనగర్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎయిర్‌పోర్టు స్థాయిలో సదుపాయాలు కలిగిన ఈ స్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఏసీ/నాన్‌ఏసీ వెయిటింగ్ హాల్స్, ఫుడ్ కోర్టులు, టాయిలెట్లు, సోలార్ ప్లాంట్ వంటి అనేక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు సెల్ఫీలు తీసుకునే స్థాయికి ఇది చేరిందని ఆయన తెలిపారు.

11 ఏళ్లలో రాష్ట్రంలో 20కి పైగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని, మొత్తం 2,298 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క తెలంగాణకే రూ.42,119 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రమే రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను త్వరలో అమృత్ భారత్ పథకంలో చేర్చుతామని, ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణంలో కూడా ఒక లైన్‌ను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హసన్‌పర్తి–కరీంనగర్ నూతన రైల్వే మార్గానికి సంబంధించిన అన్ని చర్యలు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.

# కేసీఆర్‌కు నోటీసులు అందాయో లేదో?

**తమకు స్పష్టంగా తెలియదు**

**అందితే విచారణకు హాజరు కావాలా? వద్దా అని ఆలోచిస్తాం**

**నోటీసులు ఓ డ్రామా**

**ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నం**

**'పాలమూరు–రంగారెడ్డి విషయంలో ఏమి లేదని సుప్రీంకోర్టు స్పష్టం**

**కాళేశ్వరం గురించి కూడా త్వరలో నిజనిజాలు**

**సీఎం రేవంత్ రెడ్డికి ఒక వ్యాధి ఉంది.. కేటీఆర్ తీవ్ర విమర్శ**

**నోటీసుల డ్రామా వెనుక అసలు ఉద్దేశం ఏమిటో ప్రజలకు తెలుసు : కేటీఆర్**



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విరుచుకుపడిన ఆయన, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు నోటీసుల డ్రామా నడుస్తోందని కేటీఆర్ అన్నారు. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులు, కేసులు, బదిలీలు, నోటీసులు వంటి పలు అంశాలపై పలు వ్యాఖ్యలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో ఏమీ లేదని సుప్రీం కోర్టు స్పష్టంగా తెలిపిందని కేటీఆర్ చెప్పారు. అదే విధంగా కాళేశ్వరం గురించి కూడా త్వరలో నిజాలు బయట పడతాయని అన్నారు. కేవలం రెండు పిల్లర్లు కూలిపోయిన అంశాన్ని బిగుతుగా పట్టుకుని దాన్ని రాజకీయంగా వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

సీఎం రేవంత్ రెడ్డి మాటల్లో స్థిరత లేదని, ఒక్కో రోజు ఒక్కో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. "ఒక రోజు కాళేశ్వరం కూలేశ్వరం అంటారు, మరుసటి రోజు అక్కడినుంచి నీళ్లు తేవాలని చెబుతారు. సీఎం మాటల్లో విశ్వసనీయత లేదు" అని ఆరోపించారు. అలాగే ఎస్ ఎల్‌బీసీ ప్రమాదంపై ఒక్కరిపై అయినా చర్యలు తీసుకున్నారా అని ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ కేసులు, నోటీసులు వచ్చాయని కేటీఆర్ ఆరోపించారు. ఇది మరో "లొట్టపీసు కేసు" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. "కమిషన్ గడువు ముగిసిన తర్వాత ఎందుకు పెంచారు? ఇదంతా కేవలం రాజకీయ బదులు తీయడానికే" అని మండిపడ్డారు. నిన్న ఈటెల రాజేందర్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు.

ఇటీవల హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ ఈవెంట్ సందర్భంగా మంత్రులు టూర్ గైడ్‌లుగా మారిపోయారని విమర్శించారు. "ఒకవైపు మిస్ వరల్డ్ బ్యూటీస్, మరోవైపు నోటీసులతో కాలం వెళ్లదీస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో భారీగా పోలీస్ అధికారుల బదిలీలు జరగడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హోంశాఖ 30 మంది ఏఎస్పీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని పలు అనుమానాలకు తావిచ్చే చర్యగా అభివర్ణించారు. "హెలికాప్టర్‌ను షేర్ ఆటోలా వాడుతున్నారు" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఇప్పటివరకు కేసీఆర్‌కు నోటీసులు అందాయో లేదో కూడా తమకు స్పష్టంగా తెలియదని కేటీఆర్ చెప్పారు. అయితే అందితే హాజరుకావాలా లేదా అన్నదానిపై ఆలోచిస్తామని తెలిపారు. "కాళేశ్వరం ప్రాజెక్టును సుప్రీంకోర్టు కూడా ఒక ఇంజినీరింగ్ అద్భుతంగా అభివర్ణించింది. దాన్ని రాజకీయంగా మలచే ప్రయత్నం బాధాకరం" అని కేటీఆర్ అన్నారు.

# జూన్ 20 లోపు హాజరుకండి

**లేకుంటే నేరస్తుడిగా పరిగణిస్తాం**

**ప్రభాకర్ రావుకు నాంపల్లి కోర్టు ఆదేశం**

**మరో నిందితుడు శ్రవణ్ కుమార్ కస్టడీ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్**

**శ్రవణ్ కుమార్‌పై రూ.6.58 కోట్ల మోసం కేసు కూడా నమోదు**



హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి. ప్రభాకర్‌రావుకు నాంపల్లిలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. జూన్ 20వ తేదీలోగా కోర్టు ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది.

గడువులోగా ప్రభాకర్ రావు కోర్టు ముందు హాజరుకాని పక్షంలో ఆయనను 'ప్రొక్లెయిమ్డ్ అఫెండర్' (ప్రకటిత నేరస్థుడు)గా పరిగణిస్తామని కోర్టు హెచ్చరించింది. ఈ ఏడాది జనవరిలోనే ప్రభాకర్‌రావుతో పాటు మరో నిందితుడు ఎ. శ్రవణ్ కుమార్‌రావును ప్రొక్లెయిమ్డ్ అఫెండర్లుగా ప్రకటించే ప్రక్రియను ప్రారంభించేందుకు అనుమతించాలని కోరుతూ హైదరాబాద్ పోలీసులు నాంపల్లి కోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీరిద్దరూ విదేశాలకు పారిపోయారని, అధికారిక నోటీసులను పట్టించుకోకుండా అరెస్టు నుంచి తప్పించుకు తిరుగుతున్నారని పోలీసులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శ్రవణ్ కుమార్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

తనను అరెస్టు చేయరనే షరతుపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు హాజరయ్యేందుకు శ్రవణ్‌కుమార్ అంగీకరించారు. ప్రభాకర్‌రావు విషయంలో మాత్రం ప్రొక్లమేషన్ ప్రక్రియను కొనసాగించేందుకు నాంపల్లి కోర్టు పోలీసులకు అనుమతినిచ్చింది. ఇందులో భాగంగానే, ప్రభాకర్‌రావు స్వచ్ఛందంగా హాజరయ్యేందుకు జూన్ 20ని తుది గడువుగా నిర్దేశించింది. ఒకవేళ ఆయన ఈ ఆదేశాలను పాటించడంలో విఫలమైతే, అభియోగాలు నమోదు చేసిన 90 రోజుల తర్వాత ఆయన గైర్హాజరీలోనే విచారణ జరిపే అవకాశం ఉందని కోర్టు తెలిపింది.

**శ్రవణ్ కుమార్ కస్టడీ పిటిషన్‌పై ఉత్కంఠ**

మరోవైపు, ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్ కుమార్‌రావుపై మరో మోసం కేసు కూడా నమోదైంది. ఐరన్ ఓర్ కొనుగోలు పేరిట అఖండ్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను శ్రవణ్ కుమార్, ఆయన అనుచరులు రూ.6.58 కోట్లకు పైగా మోసం చేశారని ఆ సంస్థ డైరెక్టర్ ఆకర్ష్ కృష్ణ ఫిర్యాదు చేశారు. ఈ చీటింగ్ కేసుకు సంబంధించి శ్రవణ్ కుమార్‌ను ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. ఈ కేసులో శ్రవణ్ కుమార్‌ను విచారించేందుకు కస్టడీ అవసరమని పోలీసులు కోరారు.

# రైల్వేస్టేషన్‌లు ప్రారంభించుకోవడం గర్వకారణం

**వరంగల్ ప్రాంత అభివృద్ధిలో భాగమే**

**అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద**

**వరంగల్ రైల్వే స్టేషన్ పునఃప్రారంభం**

**డీకే అరుణ**



వరంగల్ : అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా గురువారం వరంగల్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి భూపతి శ్రీనివాస వర్మ, ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసిన 103 రైల్వే స్టేషన్లలో వరంగల్, బేగంపేట్, కరీంనగర్ స్టేషన్లను ప్రారంభించడం గర్వకారణమన్నారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి శ్రేణిలో భాగమే అని ఆమె తెలిపారు. రైల్వే స్టేషన్లను అత్యాధునిక సదుపాయాలతో పునఃనిర్మాణం చేసి, సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2014 నుంచి వరంగల్ ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఇదంతా మోడీ నిష్పక్షపాత పరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, రోడ్లు, రైల్వే రంగాల్లో కేంద్రం నిధులు కేటాయిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నదని, ఇది మతపరమైన లేదా ప్రాంతీయ వివక్ష లేకుండా దేశంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రధాని దృఢ సంకల్పానికి నిదర్శనమని ఆమె అన్నారు.